క్లుప్తంగా

రూ.13.08 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు



నరసరావుపేట రూరల్: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రూ.13.80 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. కళాశాలకు చెందిన సీఎస్ఈ విద్యార్థులు చిన్నం జానకిదేవి, తేజా చరణ్ దుల్లా, టాటా సుమంత్‌లు కంపెనీ నిర్వహించిన రాతపరీక్ష, టెక్నికల్ రౌండ్, ముఖాముఖి పరీక్షల్లో ప్రతిభచాటి ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్, విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతుడి చేతిపై ఉన్న పచ్చబొట్టు

నరసరావుపేటటౌన్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నరసరావుపేట రైల్వే ఎస్ఐ వెంకటాద్రి బుధ వారం తెలిపారు. రైల్వే స్టేషన్ పరిధిలోని వినుకొండ నుంచి చీకటీగలపాలెం వెళ్లే మార్గంలో రైలు పట్టాలపై 35 సంవత్సరాల వ్యక్తి మృతి చెందాడన్న సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతుడు నలుపు రంగు చొక్కా, నలుపు రంగు షాట్ ధరించి ఉన్నాడన్నారు. చేతిమీద బాషా, బీఆర్‌ఏ అనే పేరు ఇంగ్లిష్‌లో రాసి ఉండటాన్ని గుర్తించారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు నరసరావుపేట రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

నరసరావుపేట రూరల్: పేకాట శిబిరంపై రూరల్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఆరుగురు నిందితులను అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ.46 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు మండలంలోని పమిడిపాడు చేపలచెరువు వద్ద పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే సమాచారం ఇన్‌చార్జ్ డీఎస్పీ ఎం.హనుమంతురావుకు అందింది. ఆయన ఆదేశాల మేరకు నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ సిబ్బందితో దాడులు నిర్వహించారు. అక్కడ పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.46 వేలు నగదుతో పాటు పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. కాగా మండలానికి చెందిన తెలుగు యువత జిల్లా నాయకుడు ఆధ్వర్యంలోనే పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు పోలీసులు విచారణలో తెలిసింది. కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ కిషోర్ తెలిపారు.

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ

బొల్లాపల్లి: పాత రైస్ కార్డుల స్థానంలో ప్రభుత్వం కొత్తగా రైస్ కార్డులు జారీ చేయడమైందని తహసీల్దార్ ఎ.వి.సుధాకర్ తెలిపారు. మండల కేంద్రం లోని రామాలయం వద్ద రైస్ కార్డుల పంపిణీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 43 రేషన్ షాపులకు 20 వేల స్మార్ట్ రైస్ కార్డులు వచ్చాయని చెప్పారు. స్మార్ట్ రైస్ కార్డులను లబ్ధిదారులు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమం లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ యజ్ఞం



వినుకొండ: విశ్వబ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో ఎస్ఎస్‌పీలోని సాయిబాబా దేవాలయం ప్రాంగణంలో కడియాల ఆంజనేయశాస్త్రి పర్యవేక్షణలో విశ్వబ్రాహ్మణ దంపతులచే విశ్వకర్మ యజ్ఞం, హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ పల్నాడు జిల్లా డైరెక్టర్ మోతడక వీరాచారి పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టింబర్ డిపో వ్యాపారవేత్త బోగోలు శ్రీనివాసరావు, ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ ప్రధాన కార్యదర్శి కుందుర్తి సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు 11 రకాల పరీక్షలు ఉచితం

రొంపిచర్ల: మండలంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో బుధవారం నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు మహిళలకు 11 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్లు మండల్ నోడల్ అధికారి డాక్టర్ పోతిరెడ్డి జగన్‌నరసింహారెడ్డి తెలిపారు. స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, కౌమారిక బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బుచ్చిబాపన్నపాలెంపై ఎందుకంత కక్ష?

- అనుమతులు లేకుండా ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం బాధాకరం
- నిరసన వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి


మరుగుదొడ్లు, వంటశాల, ఓవర్‌హెడ్ ట్యాంక్ ధ్వంసం చేసిన దృశ్యం


వాటర్ ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలాలు


పడవేసిన స్లాబ్

రొంపిచర్ల: ఎలాంటి అనుమతులు లేకుండా బుచ్చిబాపన్నపాలెం అంగన్‌వాడీ భవనంలోని చెట్లు, వాటర్ ట్యాంక్, మరుగుదొడ్లు, వంట గదులను తొలగించడం పట్ల జిల్లా వైఎస్సార్ సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని తన స్వగ్రామమైన బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో ఆయన బుధవారం పర్యటించిన సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. 1993లో డిస్ట్రిక్ట్ ప్రైమరీ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం క్రింద ఈ భవనాన్ని నిర్మించారు. కొన్నాళ్లు పాఠశాలను నిర్వహించిన అనంతరం గ్రామంలోని హైస్కూల్‌లో ఈ పాఠశాలను విలీనం చేయటంతో భవనం ఖాళీగా ఉంది. దీంతో ఈ భవనంలో ఓసీ, బీసీ అంగన్‌వాడీ సెంటర్లను ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాలకు 30 మంది చిన్నారులు హాజరవుతున్నారని తెలిపారు. గత శుక్రవారం గ్రామానికి చెందిన కొంతమందితో పాటు బయట వ్యక్తులు కాంపౌండ్‌లోకి ప్రవేశించి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. నాలుగు మరుగుదొడ్లు, తాగునీటి వ్యవస్థను ధ్వంసం చేయటంతో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పటిష్టంగా ఉన్న మరుగుదొడ్లను, వంటశాలను, వాటర్ ఓవర్ హెడ్ ట్యాంక్‌ను తొలగించారన్నారు. 25 సంవత్సరాల వయస్సుగల చెట్లను కూడా తొలగించటం బాధాకరమన్నారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే విద్యాశాఖ అధికారులు ఫిర్యాదు చేయాలని, అంగన్‌వాడీ వారు ఫిర్యాదు చేయాలంటూ కేసు కట్టకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని ఎండీవో, సీడీపీవో దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయితే ఈ నిధులు దాతలు ఇస్తున్నారని చెబుతున్నారన్నారు. ప్రభుత్వ స్థలంలో ఏ నిర్మాణం చేయాలన్నా అనుమతి అవసరమన్నారు. పంచాయతీ తీర్మానం కానీ, ప్రభుత్వం నుంచి టెండర్ గాని, వర్కు ఆర్డర్ కూడా లేకుండా పనులు చేయటం ఏమిటని ప్రశ్నించారు. ఈ పరిస్థితుల్లో చిన్నపిల్లలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏ అనుమతులు లేకుండా పనులు చేస్తుంటే చూస్తూ ఊరుకోవాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే స్వగ్రామమని ప్రభుత్వం కక్షతో వ్యవహరిస్తోందన్నారు. గ్రామంలో కనీస సౌకర్యాలు అయిన పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంచినీళ్లు ఆపరేట్ చేసే వారికి, గ్రామంలో పారిశుద్ధ్యం పనులు నిర్వహించే గ్రీన్ అంబాసీడర్లకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వటంలేదన్నారు. పంచాయతీలో రూ.12 లక్షల రూపాయల నిధులు ఉన్నా ఖర్చు చేయటానికి అనుమతించటం లేదన్నారు. ప్రభుత్వం వచ్చిందని గ్రామంలో తామే పనులు చేయాలని అంటున్నారన్నారు. గ్రామంలో సొసైటీ కార్యాలయం ఉన్నా యూరియా ఇవ్వటం లేదన్నారు. దీంతో బ్లాక్‌లో రూ.500ల వరకు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రైతులకు వచ్చిందన్నారు. గ్రామంలో జరుగుతున్న అన్ని విషయాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. శాశ్వత కట్టడాలను కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరి వెంట మార్కెట్ మాజీ చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, ఎంపీటీసీ తిరుపతయ్య, మోతుకూరి వెంకటేశ్వర్లు, సర్పంచ్ కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు చీమల శ్రీనివాసరెడ్డి, గజ్జల ముసలారెడ్డి, పానుగోటి వెంకట్రావు, గెల్లి చినకోటిరెడ్డి, పడాల హనిమిరెడ్డి, చపారపు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కాకాని విద్యార్థులు


పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు రామిశెట్టి

నరసరావుపేట రూరల్: కాకాని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామిశెట్టి గోవిందరాజు బుధవారం తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14న సత్తెనపల్లిలో నిర్వహించిన జూనియర్ బాలికల కబడ్డీ పోటీల్లో పాఠశాలకు చెందిన అడపాల విఘ్నేశ్వరి, అడపాల భవానిలు ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈనెల 25 నుంచి ఎన్‌టీఆర్ జిల్లా గొల్లపూడిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు. చిలకలూరిపేట ఏఎంజీ పాఠశాలలో నిర్వహించిన అండర్-17 బాల, బాలికల జూడో పోటీలలో 35 కేజీల విభాగంలో పాఠశాల విద్యార్థిని గుంజి అఖిలాండేశ్వరి పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వారధి 2025 వ్యాసరచన పోటీలలో పాఠశాలకు చెందిన నిడమానూరి సాయి నీలిమ, నాలి లక్ష్మీ రేవతిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు గోవిందరాజులు, వ్యాయామ ఉపాధ్యాయినీ వడ్లమూడి రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయం

ఎస్ఎస్ఎన్ కళాశాల, ఎన్ఇసీ కళాశాలలో రక్తదాన శిబిరాలు


రక్తదానం చేస్తున్న యువకులు, నాయకులు

నరసరావుపేట: దేశ ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాలలో భాగంగా బుధవారం పట్టణంలోని స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యకులు ఏలూరి శశికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరాకుశం శ్రీనివాస్, స్టేట్ బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు, కాలేజ్ కమిటి అధ్యకులు కపలవాయి విజయ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం కోటప్ప కొండరోడ్డులోని ఎన్ఇసీ కళాశాలలో కాలేజ్ చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. మోదీ నాయకత్వంలో శరవేగంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. మేక్ ఇన్ ఇండియా ద్వారా స్వదేశీ కంపెనీలను ప్రోత్సహించి దేశాన్ని స్వావలంబన దిశగా నడిపిస్తున్నారని అన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు శశికుమార్ విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా పాత పలనాడు బస్‌స్టాండ్ శివుని బొమ్మ సెంటర్లలో పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొని , ప్రధాని మోదీ చేతి వృత్తులను ప్రోత్సహించడానికి విశ్వకర్మ యోజన పథకం ద్వారా అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరు పథకాలను వినియోగించుకోవాలని కోరారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నానో యూరియా వాడకాన్ని పెంచాలి


వరి నాట్లలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, డీఏవో జగ్గారావు

నరసరావుపేట రూరల్: నానో యూరియాను ఉపయోగించడం వలన క్యాన్సర్‌కు చెక్‌పెట్టవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. మండలంలోని ఇక్కుర్రు గ్రామంలో బుధవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ పాల్గొని రైతులతో కలిసి వరినాట్లలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులైన యూరియా వాడకాన్ని రైతులు తగ్గించాలని సూచించారు. నానోయూరియా వలన నీటి కాలుష్యం కూడా తగ్గుతుందని సూచించారు. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు మాట్లాడుతూ నానో యూరియా రసాయన యూరియాకు తగ్గట్టుగానే పంటలపై పని చేస్తుందని తెలిపారు. అవసరానికి మించి యూరియాను నిల్వ చేసుకోవద్దని రైతులుకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ కె.వి. శ్రీనివాసరావు, ఏవో శాంతి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పునాటి శ్రీనివాసరావు, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ కొల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు

యడ్లపాడు: మహిళల ఆరోగ్యం- బలమైన కుటుంబానికి పునాది అనే లక్ష్యంతో కేంద్రం రూపొందించిన 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి భరద్వాజ తెలిపారు. బుధవారం ఆయన కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు మండలం పరిధిలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, పిల్లలు, యువతకు అవసరమైన ఆరోగ్య సంరక్షణ కల్పించడమే ఈ శిబిరాల ప్రధాన ఉద్దేశ్యమని ఆయన అన్నారు.

స్వస్థ నారి – సశక్త్ పరివార్ అభియాన్

కార్యక్రమంలో భాగంగా మహిళలు, యుక్తవయసు బాలికలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగా గుర్తించడం, రక్తహీనత, టీబీ, సికిల్‌సెల్, ఎనీమియా పరీక్షలు నిర్వహించడం ఈ శిబిరాలలోని ప్రధాన అంశాలని వివరించారు. గర్భిణులకు ప్రసూతి పరీక్షలు, పిల్లలకు రోగ నిరోధక టీకాలు వేయడం, మహిళలు, కౌమార దశలోని బాలికలకు రుతుక్రమ పరిశుభ్రత, ఆరోగ్య అవగాహన, పోషకాహారంపై కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. రక్తదాన శిబిరాలు, ప్రధానమంత్రి మాతృవందన యోజనలో ప్రత్యేక నమోదు, ప్రసూతి, శిశుసంరక్షణ (ఎంసీపీ)కార్డు మంజూరు, ఆయుష్మాన్ వయోవందన కార్డు, సికిల్‌సెల్ కార్డులు పంపిణీ, పీఎంజేఏవై ఆయుష్మాన్ ఐడీ రిజిస్ట్రేషన్ కార్యక్రమాలు కూడా జరుగుతాయన్నారు.

శిబిరాల నిర్వహణ ఇలా..

మండలంలోని 12 గ్రామ సచివాలయల పరిధిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరాలను ఉంటాయి. శిబిరంలో ఎంఎస్ లేదా ఎండీ వైద్య నిపుడితో పాటు ప్రభుత్వ వైద్యులు, 14 మంది వైద్యసిబ్బంది పాల్గొని ఆయా సేవలను అందిస్తారు. సెప్టెంబర్ 18వ తేదీన యడ్లపాడు-1లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రారంభిస్తారు. 19న వంకాయలపాడు, 20న చెంఘీజ్‌ఖాన్‌పేట, 22న యడ్లపాడు-2, 23న లింగారావు పాలెం, 24న జాలాది, 25న సొలస, 26న కారుచోల, 27న తిమ్మాపురం, 29న కొండవీడు, అక్టోబర్ 1న తుర్లపాడు, సందెపూడి గ్రామ సచివాలయాల పరిధిలో ఆయా శిబిరాలు నిర్వహిస్తారన్నారు.

స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలు


నరసరావుపేటలో ర్యాలీకి పచ్చజెండా ఊపుతున్న ఎమ్మెల్యే చదలవాడ, కమిషనర్

వినుకొండ: స్వచ్ఛతాహీ సేవ 2025లో భాగంగా పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గల సాయిబాబా గుడి వద్ద నుంచి గంగినేని కళ్యాణ మండపం వరకు స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని స్వచ్ఛత మనందరి బాధ్యత అని, స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ వినుకొండను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ర్యాలీలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, శివశక్తి ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి, మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

చీకటీగలపాలెంలో..

మండలంలోని చీకటీగలపాలెంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పుట్టారెడ్డి మాట్లాడుతూ సహజ వాతావరణాన్ని కాపాడుకోవాలని, పర్యావరణాన్ని పరిశుభ్రతను కాపాడాలని, వాడిన వస్తువులను పునర్వినియోగం చేయడానికి కృషి చేయాలన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడడం మానేయాలని ప్లాస్టిక్ సంచులు బదులు పేపరు బ్యాగ్స్, జ్యూట్ సంచులు వాడాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛత హీ సేవ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుందరరెడ్డి, ఎంఆర్‌సీ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి బీఏకే జిలానీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట: స్వచ్ఛ నరసరావుపేట సాధించడంలో పట్టణ ప్రజలు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ పార్కు వరకు చేపట్టిన ర్యాలీకి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. గాంధీపార్కు వరకు ర్యాలీలో కొనసాగి అక్కడ ఏర్పాటు చేసిన బయో ప్లాస్టిక్ స్టాల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లచుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వర్షపు నీరు నిల్చున్న చోట దోమలు వృద్ధి చెందుతాయన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీకి కేటాయించిన కంపాక్టర్ వాహనాన్ని ప్రారంభించారు. ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, ఎంఇ రవి, డీఇ రఫీక్, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, మెప్మా సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి



బొల్లాపల్లి: అధికారులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా మెలగాలని, మండల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీపీ బత్తి రాములు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయా శాఖల అధికారులు వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో దోమల వలన వ్యాధులు ప్రబలుతున్నాయని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని అన్నారు. పారిశుద్ధ్యం క్షీణించిందని, సీజనల్ వ్యాధులతో అనారోగ్యం పాలవుతున్నారని, అధికారులు తగు శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి అందే నిధులు, రాయితీలు దుర్వినియోగం కాకుండా అధికార యంత్రాంగం సద్వినియోగ పరచాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ సుధాకర్, ఎంపీడీవో పి.మాధురి, నీటిపారుదల శాఖ బోర్డు డైరెక్టర్ పి.నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పి.వెంకట్ నారాయణ, కో ఆప్షన్ నెంబర్ షేక్ మౌలాలి, మండల ప్రాదేశిక సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శీతల భవన నిర్మాణ పనులకు భూమి పూజ

రూ.11 కోట్ల 80 లక్షల వ్యయంతో నిర్మాణం


భూమి పూజలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ఈపూరు (శావల్యాపురం): ఈపూరు సొసైటీ సారథ్యంలో నాబార్డు మంజూరు చేసిన నిధులతో శీతల గిడ్డంగి కేంద్రం (కోల్డ్‌స్టోరేజీ భవనం) నిర్మాణ పనులకు రాష్ట్ర విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం భూమి పూజ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఆరుగాలం రైతులు సాగు చేసిన పంటలు గిట్టుబాటు ధర లేని సమయంలో కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచుకునేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన నూతన కోల్డ్ స్టోరేజీ రూ.11 కోట్లు 80 లక్షల వ్యయంతో నిర్మాణ పనులు పారదర్శకంగా ఆరు నెలల వ్యవధిలో పూర్తి అయ్యేలా క్షేత్రస్థాయిలో సొసైటీ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ఇందుకుగాను ఒక ఎకరం 10 సెంట్లు స్థలం కేటాయించామన్నారు. రానున్న రోజుల్లో రైతులకు మరింత మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ సారథ్యంలో కోల్డ్‌స్టోరేజీ భవన నిర్మాణ పనులు జరుగుతాయన్నారు. 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన కోల్డ్‌స్టోరేజీ లో రైతులు సాగు చేసిన అన్నీ రకాల పంటలు నిల్వ చేసుకునేలా ఆధునీకరణ పరికరాలు ద్వారా నిర్మాణ పనులు జరుగుతాయన్నారు. వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) తరుపున నిర్మించనున్న కోల్డ్‌స్టోరేజీలో రైతులకు తక్కువ ధరకు నిల్వ చేసుకోవటంపాటు నిల్వ ఉంచిన పంటలకు తక్కువ వడ్డీరేటుకు రుణాలు మంజూరు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావు, ఈపూరు సొసైటీ అధ్యక్షులు ఇడుపలపాటి హనుమయ్య, డైరెక్టర్లు కోటేశ్వరరావు, నరసింహారావు, సొసైటీ సీఈవో పోకా కోటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈవో సత్యనారాయణసింగ్

చిలకలూరిపేట: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎంఈవో బి.సత్యనారాయణసింగ్ చెప్పారు. పట్టణంలోని సెయింట్ జేవియర్ గ్లోబల్ స్కూల్‌లో ఐటీసీ సంస్థ ఆధ్వర్యంలో వావ్ (వెల్ బీయింగ్ ఔట్ ఆఫ్ వేస్ట్) విద్యార్థులకు పాత పుస్తకాల రీసైక్లింగ్ చేసి నోట్ పుస్తకాలుగా మార్చటం వలన కలిగే ఉపయోగాలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వావ్ ప్రోగ్రాం గురించి పరీక్ష నిర్వహించి విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సెల్వీ మ్యాథ్యూ, స్కూల్ డైరెక్టర్ జాన్, వావ్ సిబ్బంది అశోక్, షఫి, సౌజన్య, రియాజ్, రాజయ్య పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా యోజన పథకాలను బ్యాంకు ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని (చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు) ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు శావల్యాపురం బ్యాంకు శాఖ మేనేజరు వలేటి శివకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంలో ఒక్కో ఖాతాదారుడు సంవత్సరానికి రూ.436లు చెల్లిస్తే సాధారణంగా ప్రమాదవశాత్తు మరణించిన వారి నామిని ఏపీ గ్రామీణ బ్యాంకు ద్వారా ఎల్ఐసీ సంస్థ సహకారంతో రూ. 2 లక్షలు మంజూరు చేస్తామన్నారు. అందులో భాగంగా ముట్లూరి విజయకుమారి (శావల్యాపురం) ఎండ్ల మంగమ్మ (శానంపూడి) దాసరి చిన మాణిక్యం (ముండ్రువారిపాలెం) ముగ్గురు అకాలంగా మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు (నామినులు) రూ. 2 లక్షల బీమా పరిహారం అందజేసినట్లు మేనేజరు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ మేనేజర్లు అరుణ్‌నెహ్రూ, దిలీప్‌కుమార్, సిబ్బంది రామిరెడ్డి,ఉన్నారు.

గుడి ఆస్తి అన్యాక్రాంతంపై ఫిర్యాదు

యడ్లపాడు: స్థానిక చిన్నాంజనేయస్వామిగా ప్రసిద్ధి చెందిన ప్రపత్తి ఆంజనేయ స్వామి గుడికి చెందిన స్థిరాస్తిని అక్రమంగా అన్యాక్రాంతం చేసేందుకు యత్నాలు జరుగుతున్నాయని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న వ్యక్తి తన భార్య పేరు మీద ఆలయానికి చెందిన వాణిజ్య దుకాణాలకు అక్రమంగా హక్కు పత్రాలు పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బ్యాంకు తాకట్టుతో వెలుగులోకి..

సుమారు మూడు సెంట్ల విస్తీర్ణంలో నిర్మించిన ఆ దుకాణాలను రుణం కోసం తనఖా పెట్టేందుకు వాటిని బ్యాంకులో దరఖాస్తు చేయగా, బ్యాంకు సిబ్బంది తనిఖీ కోసం దుకాణాల వద్దకు వచ్చిన క్రమంలో తమకు విషయం తెలిసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, బాధ్యుడైన నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కమిటీ సభ్యులు కోరారు. ఈ విషయమై అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

విచారణ అనంతరం చర్యలు..

ఈ ఫిర్యాదు చేసిన వారిలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటనర్సు, దేసు ఆంజనేయులు, చీమకుర్తి కిషోర్, ఐతా రామకోటేశ్వరరావు, బత్తు రాజేష్, కొల్లా సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఉన్నారు. ఈ విషయంపై ఎస్ఐ శివరామకృష్ణను వివరణ కోరగా, ఆలయానికి సంబంధించిన పత్రాలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా విశ్వశాంతి వేడుకలు

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్ళమ్మ అమ్మ వారి దేవాలయం అవరణలో శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి సన్నిధిలో శ్రీ విరాట్ విశ్వకర్మ విశ్వశాంతి యజ్ఞ మహోత్సవ వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసరావుపేట డివిజన్

99122 25439 (నరసరావుపేట)
90105 83302 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)

Office mail : sakshigntadvt@gmail.com